క్లుప్తంగా

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



బ్లూ ఓషన్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

పెద్దాపురం: గత 12 ఏళ్లుగా ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం తొలగించడంపై వారు స్థానిక వడ్లమూరు రోడ్డులో బ్లూ ఓషన్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. ఎటువంటి సమాచారం లేకుండా యాజమాన్యం 89 మందిని తొలగించిందంటూ నినాదాలు చేశారు. అకస్మాత్తుగా వారిని తొలగించడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయని, యాజమాన్యం స్పందించి వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

14న హమాలీల రాష్ట్ర మహాసభ



హమాలీల సమావేశంలో మాట్లాడుతున్న విప్పర్తి కొండలరావు

సామర్లకోట: ఏపీ బేవరేజ్ హమాలీల ఐదో రాష్ట్ర మహాసభ ఈ నెల 14న జరుగుతుందని, దీనిని జయప్రదం చేయాలని ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఐఎంఎఫ్ఎల్ డిపోలో హమాలీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నీలమ్మ చెరువు వద్ద ఉన్న లయన్స్ క్లబ్ భవనంలో జరిగే రాష్ట్ర మహాసభలో సీఐటీయూ అనుబంధంగా ఉన్న 18 డిపోల నుంచి ప్రతినిధులు హాజరవుతాయని తెలిపారు. నాలుగో మహాసభ 2022లో కడపలో జరిగిందన్నారు. అప్పటి నుంచి ఈ మూడేళ్ల చేసిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను సమీక్షించి భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తామన్నారు. ఈ మహాసభను అమలాపురం, సామర్లకోట ఐఎంఎఫ్ఎల్ డిపోలు కలిసి సామర్లకోటలో నిర్వహిస్తున్నాయన్నారు. స్థానిక యూనియన్ అధ్యక్షుడు వి.అప్పలరాజు, కార్యదర్శి సోమేశ్వరరావు, ఉపాధ్యక్షులు బి.ఆదినారాయణ, రామారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన ఉపవాస ప్రార్థనలు

పెద్దాపురం: తిరుపతి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో ప్రపంచ శాంతి కోసం రెండు రోజుల పాటు నిర్వహించిన ఉపవాస ప్రార్థనలు శుక్రవారంతో ముగిశాయి. మందిర నిర్వాహకుడు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన ప్రార్థనల్లో దైవజనులు క్రిషోష్టం, టి.జయరాజ్ దైవ సందేశాన్ని అందించారు. సంఘ విశ్వాసులు ఆలపించిన క్రైస్తవ విప్లవ గీతాలు ఆకట్టుకున్నాయి. మందిర వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం, దైవజనులు కె.జయకుమార్, వంకా జాన్, కె.అభిషేకర్, కృపావరం, పాస్టరమ్మలు నంగిన శాంతకుమారి, ప్రేమలత, విశాల పాల్గొన్నారు.

సామాజిక భవనానికి నేడు శంకుస్థాపన

సామర్లకోట: స్థానిక 13వ వార్డు బలుసులపేటలో ఎంపీ నిధులతో నిర్మించనున్న సామాజిక భవనానికి శనివారం శంకుస్థాపన చేస్తారని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య శుక్రవారం తెలిపారు. అదే విధంగా అల్లూరి సీతారామరాజు పార్కు కాంపౌండ్ వాల్ ప్రారంభోత్సవం ఉంటుందన్నారు.

15న మండల సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎ.లక్ష్మీరెడ్డి శుక్రవారం తెలిపారు. ఇది ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని, అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికతో హాజరు కావాలన్నారు.

కొత్తపల్లి మండల గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు

కొత్తపల్లి

గ్రామ సచివాలయం	ఫోన్ నెంబర్
ఉప్పాడ- 1	9951422177
ఉప్పాడ-2	6304179606
ఉప్పాడ-3	6976476445
ఉప్పాడ-4	9494464562
కొత్తపల్లి	9949470886
కొమరగిరి-1,2	9492143912
రమణక్కపేట	8185994997
శ్రీరాంపురం	8185994997
కొండెవరం-1	9492834413
కొండెవరం-2	8886384494
మూలపేట	9133666825
నాగులపల్లి-1,2	9493288248
అమీనాబాద్ -1	8555818794
అమీనాబాద్-2	8332006890
యండపల్లి-1	9949563505
యండపల్లి-2	9391545575
గోర్స	9392881512
పొన్నాడ-1	9704397769
పొన్నాడ-2	8106235468
కుతుకుడుమిల్లి	9493982629
వాకతిప్ప	9618788873
అమరవిల్లి	9059551199

సొంత గూడు.. మరిచారు చూడు

- అద్దె భవనంలోనే గ్రంథాలయం
- సొంత గూటికి స్థలం కేటాయించాలని డిమాండ్

సామర్లకోట: విజ్ఞానాన్ని పెంచేవే గ్రంథాలయాలు.. పోటీ ప్రపంచంలో వీటికి ప్రాధాన్యం ఎనలేనిది.. అలాంటి విజ్ఞాన కేంద్రం అవస్థల మాటున కొట్టుమిట్టాడుతోంది.. జిల్లాలో గ్రేడ్–2 మున్సిపాలిటీగా గుర్తింపు పొందిన సామర్లకోటలో పరిస్థితి ఇది.. పట్టణంలో సుమారు 60 వేల మంది జనాభా ఉన్నారు. అయితే ఇక్కడ గ్రంథాలయానికి సొంత భవనం లేకపోవడంతో అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. 1956లో సామర్లకోట సమితి స్థాయి నుంచి మున్సిపాలిటీగా గుర్తింపు వచ్చింది. అప్పట్లో మున్సిపల్ కార్యాలయంలో బాపూజీ పేరుతో గ్రంథాలయం ఉండేది. దీని నిర్వహణ మున్సిపాలిటీకి భారంగా ఉండటంతో మూసివేశారు. అప్పటి నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఇలా అనేక చోట్లకు మార్పు చేశారు. చివరికి ప్రభుత్వం ఇచ్చే తక్కువ అద్దె కారణంగా మున్సిపాలిటీ సమీపంలోనే అద్దె భవనం లభించింది. దాంతో మున్సిపల్ కౌన్సిల్ హాల్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ రెండో అంతస్తులోకి గ్రంథాలయాన్ని మార్పు చేశారు. ప్రస్తుత కౌన్సిల్‌లోనైనా గ్రంథాలయానికి సొంత భవనం సమకూర్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కోర్టు వివాదంలో స్థలం

సుమారు పన్నెండేళ్లుగా రెండో అంతస్తు అద్దె భవనంలో గ్రంథాలయ నిర్వహణ సాగుతుంది. దాంతో వృద్ధులు, వికలాంగులు అక్కడికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యువకులే గ్రంథాలయానికి వచ్చేసరికి అలసటకు గురవుతున్నారు. ఈ పరిస్థితులను గమనించి పదేళ్ల క్రితం కౌన్సిల్‌లో గ్రంథాలయ భవన నిర్మాణానికి మున్సిపాలిటీ స్థలం కేటాయించాలని తీర్మానం చేశారు. అయితే, ఆ స్థలం కోర్టు వివాదంలో చిక్కుకుంది. దాంతో నిర్మాణం ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది.



మున్సిపల్ షాపుల వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలం

హామీలకే పరిమితం

గ్రంథాలయంలో వారోత్సవాలతో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ముఖ్య అతిథులుగా హాజరవుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రంథాలయానికి స్థలం కేటాయిస్తామని హామీలు మాత్రం ఇస్తున్నారు. అక్కడి నుంచి వెళ్లాక ఆ మాటను మరచిపోతున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. స్థలం కేటాయించాలని చిత్తశుద్ధి ఉంటే కనీసం కౌన్సిల్ అజెండాకు ఎందుకు తీసుకురావడం లేదని పలువురు అంటున్నారు. మున్సిపాలిటీ స్థలం కేటాయిస్తే భవనం నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. గతంలో మున్సిపల్ షాపుల వెనుక భాగంలో మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల నిర్వహించిన స్థలాన్ని కేటాయించడానికి స్థానికుల డిమాండ్ మేరకు అధికారులు, పాలకులు ఆ స్థలాన్ని పరిశీలించినా ఇప్పటి వరకూ కదలిక లేదు.



అద్దె భవనంలో కొనసాగుతున్న సామర్లకోట గ్రంథాలయం

స్థలం కేటాయించాలి



వాహనాల పార్కింగ్‌కు అవకాశం లేకపోవడం, రెండో అంతస్తులో గ్రంథాలయం ఉండటంతో అనేక మంది అక్కడకు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో దాని కోసం సొంత భవనం ఉండాలి. స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలి. దీనిపై కౌన్సిల్ సమావేశంలో ఐదేళ్ల పాటు పోరాటం చేశాం. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

– కాళ్ల లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్, సామర్లకోట

మరో పర్యాయం దరఖాస్తు చేస్తాం



గ్రంథాలయానికి స్థలం కేటాయించాలని మున్సిపల్ కమిషనర్‌కు గతంలో దరఖాస్తు ఇచ్చాం. మరో పర్యాయం దరఖాస్తు ఇస్తాం. కోర్టు వివాదంలో ఉన్న స్థలం వల్ల ఇబ్బంది పడే అవకాశం ఉంది. గతంలో అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిల్ సభ్యులు ప్రతిపాదించిన విధంగా కాపు కల్యాణ మండపం సమీపంలోని స్థలం కేటాయిస్తే పాఠకులకు ఎంతో అనువుగా ఉంటుంది.

– బందిల రత్నమణి, గ్రంథాలయాధికారి, సామర్లకోట

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న మరిడమ్మ వారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ వారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కొత్తపల్లి: వాకతిప్పలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శని, ఆదివారాల్లో విశాఖపట్నం అపోలో క్యాన్సర్ సెంటర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత క్యాన్సర్, తలసేమియా స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు శిబిర నిర్వాహక సిబ్బంది శ్రీనివాస్ తెలిపారు. రెండు రోజుల పాటు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ శిబిరం జరుగుతుందన్నారు. దీనికి వచ్చేవారు పాత వైద్య రిపోర్టులు ఉంటే తీసుకు రావాలన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సీతారాం ఏచూరి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: సీపీఎం అఖిల భారత కార్యదర్శిగా పనిచేసిన కామ్రేడ్ సీతారాం ఏచూరి బహుముఖ ప్రజ్ఞాశాలి అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం ఆయన ప్రథమ వర్ధంతిని సిరిపురపు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, చల్లా విశ్వనాథం మాట్లాడుతూ ఏచూరి 1974లో ఎస్ఎఫ్ఐలో, తర్వాత ఏడాది సీపీఎంలో చేరారన్నారు. 2015 ఏప్రిల్ 19న విశాఖపట్నంలో నిర్వహించిన పార్టీ 15వ జాతీయ మహాసభల్లో సీపీఐ (ఎం)కు ఐదో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారన్నారు. ఏచూరి ఆశయాలు కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో డి.సత్యనారాయణ, డి.కృష్ణ, కె.అప్పన్న, సిరపురపు మరిడయ్య, యాసలపు రమేష్, నరసింహమూర్తి, రొంగల వీర్రాజు, సూర్యనారాయణ, రమణ, నీలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఎండపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో దివంగత సీతారాం ఏచూరి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు గుర్రాల అప్పారెడ్డి, చీకట్ల సాంబ శివకుమార్, కాళ్ల నాగేశ్వరరావు, సూరిబాబు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఫిర్యాదులు చేసి డబ్బు డిమాండ్



జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘాల నేతలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ఎస్సీ, బీసీ వర్గ ఉద్యోగస్తులే లక్ష్యంగా కొందరు తప్పుడు ఫిర్యాదులు చేయించి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) కోఆర్డినేటర్ టి.చంగలరావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద దళిత సంఘాల నాయకులతో కలసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. డీఎల్‌పీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ వ్యక్తి, అభాగ్యులను ఇంటికి పిలిపించి వారి ద్వారా తప్పుడు ఫిర్యాదులు తయారు చేసి ఎస్సీ, బీసీ ఉద్యోగులను వేధిస్తున్నారన్నారు. దళిత ఉద్యోగులు మానసికంగా వేధింపులకు గురై సెలవు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే చట్టపరమైన అన్ని మార్గాల్లో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. దళిత గిరిజన సంఘ జిల్లా అధ్యక్షుడు అన్నవరం, మాల మహానాడు పిఠాపురం నియోజకవర్గ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: స్థానిక సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పెద్దాపురం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు సిరిపురపు శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రధానంగా కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలని, 14, 15 వార్డుల్లో తుప్పలు తొలగించాలని, రైతుబజార్, నంబర్ వన్ స్కూల్ వద్ద చెత్త తరలించాలని, మీ–సేవా కార్యాలయాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని, డ్రైనేజీల శుభ్రతపై దృష్టి సారించాలన్నారు. శ్మశాన వాటికలో పిచ్చిమొక్కలను తొలగించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కూనిరెడ్డి అప్పన్న, యాసలపు రమేష్, డి.కృష్ణ, నెక్కల నరసింహమూర్తి, రమణ తదితరులు పాల్గొన్నారు.

పెన్నుల పంపిణీ

కొత్తపల్లి: ఉప్పాడలో వాసవీ క్లబ్ ఫౌండర్ కల్వకుంట్ల చంద్రసేన గుప్త జయంతి వారోత్సవాలను నిర్వహించారు. ఇక్కడి నంబర్ వన్ పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు రుమాళ్లు, పెన్నులను పంపిణీ చేశారు. మండల వాసవీ క్లబ్ అధ్యక్షుడు దంగేటి దత్తాత్రేయ, సెక్రటరీ చెన్న విటల్ బాబు, ట్రెజరర్ కూరగాయల వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

సుంకాలకు వ్యతిరేకంగా సీపీఎం ధర్నా



సామర్లకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సామర్లకోట: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత దేశంపై విధించిన సుంకాలకు వ్యతిరేకంగా సీపీఎం నాయకులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు మాట్లాడుతూ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల కారణంగా జిల్లాలోని ఆక్వా రంగం పూర్తిగా సంక్షోభంలోకి కూరుకుపోతుందన్నారు. ఏటా 10 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులు జిల్లా నుంచే ఎగుమతి అవుతున్నాయన్నారు. కోనపాపపేట సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన హేచరీస్, ఆక్వా ఫీడ్ పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్‌లో సుమారు లక్ష మంది కార్మికులు ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఆక్వా సాగు యంత్రాలు, మందులు విక్రయించే దుకాణాల ద్వారా మరో 50 వేల మందికి ఆసరా లభిస్తుందన్నారు. ట్రంప్ సుంకాలతో ఈ పరిశ్రమలు ఉత్పత్తిని తగ్గించడంతో పాటు, కార్మికుల సంఖ్యను కుదిస్తున్నాయని అన్నారు. కొన్ని పరిశ్రమలు 8 గంటల పనిదినాలను 12 గంటలకు పెంచుతున్నాయని ఆరోపించారు. సంక్షోభం పేరుతో పరిశ్రమలు మూతపడే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే జరిగితే కార్మికులు రోడ్డున పడతారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలం శ్రీనివాస్, తుంపాల శ్రీనివాస్, కరణం ఏడుకొండలు, కరణం గోవిందరాజు, బాలం హరిజగదీష్, పవన్, బాలం సత్తిబాబు, పంపాల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

రసాయనశాస్త్రం నూతన పరిశోధనలకు వేదిక



సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

బాలాజీచెరువు: రసాయనశాస్త్రం నూతన పరిశోధనకు వేదికగా నిలుస్తుందని స్థానిక పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు అన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఎమర్జింగ్ ట్రెండ్ ఇన్ క్యాథలిక్ సింథస్ ఆఫ్ స్మాల్ మ్యాలిక్యులర్స్ అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఇటువంటి సదస్సులో పాల్గొనడం ద్వారా నిష్ణాతులైన అధ్యాపకుల సందేశాలు, సూచనలు తెలుసుకోవచ్చన్నారు. ఇది భవిష్యత్‌లో విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. ఐఐఎస్ఈఆర్ పూణే ప్రొఫెసర్ డీబీ రామాచారి, ఏఎన్‌యూ వర్సిటీ ప్రొఫెసర్ బి.జగన్‌మోహన్ రెడ్డి, హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురుగన్, కన్వీనర్ సంజీవ్‌కుమార్, టీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–19 విభాగంలో వివిధ పోటీలకు క్రీడాకారుల ఎంపికలు శుక్రవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానం, పీఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ ఎంపికలకు హాకీ విభాగంలో 80 మంది, స్విమ్మింగ్ విభాగంలో 50 మంది, రైఫిల్ షూటింగ్ విభాగంలో 30 మంది, ఘట్కా విభాగంలో 20 మంది, వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో 150 మంది, పవర్ లిఫ్టింగ్ విభాగంలో 50 మంది, టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్‌లో బాలుర, బాలికలు ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో హాజరయ్యారు. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ఐ అండర్–19 కార్యదర్శి, రంచోడవరం పీడీ వెంకటరెడ్డి, శివరామకృష్ణ, రత్నశామ్యూల్, ఎస్‌జీఎఫ్ఐ అండర్–14, 17 కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుధారాణి పర్యవేక్షించారు. వీటి నిర్వహణకు పీడీలు రవిరాజు, సునీల్, పట్టాభి, డీఎస్‌ఏ కోచ్‌లు సతీష్ కుమార్, సమీర్, సురేష్, అప్పలనాయుడు సహకారం అందించారు.

15న క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో ఈ నెల 15న స్థానిక జిల్లా క్రీడా మైదానంలో వివిధ క్రీడల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుధారాణి శుక్రవారం తెలిపారు. అండర్–14, 17 సాఫ్ట్ టెన్నిస్, జూడో, ఫుట్‌బాల్ అండర్–17 బాలుర, బాలికల విభాగాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అర్హత దరఖాస్తుతో ఆ రోజు ఉదయం 8.30 గంటలకు డీఎస్‌ఏకు హాజరుకావాలని కోరారు.



డీఎస్ఏలో అండర్-19 రైఫిల్ షూటింగ్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

జీవన ఛిద్రం

- తీరంలో అలజడి
- నివాసాల వద్దకు చొచ్చుకొచ్చిన నీరు



కోనపాపపేటలో కోతకు గురైన తీర ప్రాంతం

కొత్తపల్లి: సముద్రంలో అలల కల్లోలం రేగింది.. వాతావరణ మార్పుల కారణంగా రెండు రోజుల నుంచి తీరంలో అలజడి కనిపిస్తుంది.. కెరటాల ఉధృతితో తీర ప్రాంత ప్రజల్లో భయం నెలకొంది.. ఉప్పాడ తీర ప్రాంతంలో బీచ్ రోడ్డుకు రక్షణగా వేసిన రాళ్ల గోడను సైతం దాటుకుని కెరటాలు ఎగసి పడడంతో గ్రామంలోకి నీరు వస్తోంది. ఉప్పాడ శివారు గ్రామాలైన రంగంపేట, సుబ్బంపేట, కొత్తపట్నంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు, పాఠశాలలు, ఆలయాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో సమీపం నివాసాల వారు ఇబ్బంది పడుతున్నారు. ఉప్పాడ బీచ్ రోడ్డు ధ్వంసమైంది. పొన్నాడ శివారు కోనపాపపేటలో అలల ఉధృతి కారణంగా తీర ప్రాంత మత్స్యకారులు, ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.



గృహాల వద్దకు చొచ్చుకు వచ్చిన సముద్రపు నీరు



ఎంపీపీ పాఠశాల ఆవరణలోకి చేరిన నీరు



కెరటాలకు ధ్వంసమైన బీచ్ రోడ్డు



ఉప్పాడలో బీచ్ రోడ్డుపై ఎగసి పడుతున్న అలలు

జీవన శైలిలో మార్పులు అవసరం

బోట్‌క్లబ్: జీవనశైలిలో మార్పులతో మోకాళ్ల నొప్పులు దూరం చేయవచ్చని కీళ్ల వ్యాధి నిపుణుడు నెక్కంటి మాధవ్ అన్నారు. స్థానికంగా రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సమావేశాన్ని శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన నిర్వహించారు. మాధవ్ మాట్లాడుతూ మోకాళ్లకు బలాన్ని ఇచ్చే వ్యాయామాలు చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. మోకాళ్లపై అధిక బరువు పడటంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. బరువును నియంత్రించే చర్యలు చేపడితే ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సాన, కోశాధికారి ఉదయ చక్రవర్తి, సభ్యులు ముంజులూరి విశ్వేశ్వరరావు, లంక సాయిబాబు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో చిత్రలేఖన పోటీలు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వైష్ణవ సంప్రదాయం ప్రకారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ ఆర్.రాజేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో చిన్నారులకు పలు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 14న సాయంత్రం ఐదు గంటలకు శ్రీకృష్ణ చిత్రలేఖన, అనంతరం భగవద్గీత పోటీలు, 15న సాయంత్రం 5 గంటలకు శ్రీకృష్ణ విచిత్ర వేషధారణతోపాటు, శ్రీకృష్ణుడికి సంబంధించిన క్విజ్ పోటీలు జరుపుతామన్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 98666 94041 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.